క్లుప్తంగా

మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి


యలమంచిలి గణేష్

పమిడిముక్కల: మినుముకు మద్దతు ధర లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. వీరంకిలాకులో గణేష్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వరి, మినుము నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. మార్కెట్‌లో మినుము క్వింటా రూ.7,400లకే కొంటున్నారన్నారు. ఈ ధర రైతులకు గిట్టుబాటు కాదన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి క్వింటా రూ.9,000లకు కొనుగోలు చేయాలన్నారు.

యాకూబ్‌కు అంబేడ్కర్ ప్రతిభ అవార్డు



గుడివాడ టౌన్: స్థానిక మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ఉపాధ్యాయుడు సయ్యద్ యాకూబ్ పాషా కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ ప్రతిభ అవార్డు–2025కు ఎంపికైనట్లు హెచ్‌ఎం సోమవారం తెలిపారు. ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ప్రైవేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయుల ప్రతిభపై నిర్వహించే ఈ పురస్కారాలకు ఈ ఏడాది యాకూబ్‌పాషా ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 13వ తేదీ గుంటూరులో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం చేస్తారని తెలిపారు.

మజ్జిగ పంపిణీ

గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ సేవాకార్యక్రమాల్లో భాగంగా సోమవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం వద్ద క్లబ్ పూర్వ అధ్యక్షుడు అర్జా ప్రసాద్–లక్ష్మీ దంపతులు వితరణతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు కె.రామారావు తెలిపారు. క్లబ్ కోశాధికారి కె. రామ్మోహన్, డిస్ట్రిక్ట్ గవర్నర్ సనకా సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

'గోపాల రక్ష'తో పాడి రైతు కుటుంబాలకు రక్ష

గుడ్లవల్లేరు: గోపాల రక్ష పథకంతో పాడి రైతుల కుటుంబాలకు రక్ష అని కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ వల్లభనేని బాబూరావు అన్నారు. ఈ పథకం కింద వడ్లమన్నాడు పాల సంఘాధ్యక్షుడు కొణతం కృష్ణ అధ్యక్షతన పాల ఉత్పత్తిదారురాలైన పాలేటి నాగమణికి రూ.లక్ష చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పెన్నేరు రమేష్, గరికపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీతో పంచాయతీకి ఆదాయం

గుడ్లవల్లేరు: చెత్త సంపద తయారీ కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయంతో పాటు రైతులకు వానపాముల ఎరువును తయారు చేయటానికి దోహదపడుతున్నాయని గుడివాడ డీఎల్పీఓ జి.సంపత్‌కుమారి అన్నారు. గుడ్లవల్లేరు పంచాయతీ కార్యాలయ సమీపంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. పంచాయతీ పరిధిలోని చెత్త సేకరణతో తయారయ్యే వానపాముల ఎరువును కొనుగోలు చేసే రైతులకు ఆరోగ్యకరమైన పంటలు పండటమే గాక పంచాయతీకి కూడా ఆదాయం లభిస్తోందన్నారు. గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చిమటా మృతి


సూర్యనారాయణ (ఫైల్)

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చిమటా సూర్యనారాయణ(84) మృతి చెందారు. ఆలయానికి రెండు విడతలు చైర్మన్‌గా విధులు నిర్వహించి ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. మంగళవారం పామర్రులోని మృతుడి నివాసం వద్ద నుంచి అంత్యక్రియల కార్యక్రమం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

అన్నసమారాధన

మండవల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయంలో రంజాన్ సందర్భంగా సోమవారం రాత్రి అన్న సమారాధన జరిగింది. ఆలయ నిర్వాహకులు రాజాజీ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటాం

కైకలూరు: పంచాయతీ కాంట్రాక్టు కార్మికులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఎమ్మెల్యే కామినేనికి పంచాయతీ కాంట్రాక్టు వర్కర్లు తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల ఉద్యోగాలను కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. పంచాయతీ సర్పంచ్, అధికారులతో చర్చించి న్యాయం చేస్తానన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వంతెన యమడేంజర్..!

చినపులిపాక వద్ద బందరు కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో పూర్తిగా పాడైపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. వాహనచోదకులు వంతెనపై నుంచి దినదినగండం నూరేళ్ల ఆయుష్షులా రాకపోకలు సాగిస్తున్నారు.

- ప్రమాదకరంగా చినపులిపాక వంతెన
- విరిగిన రెయిలింగ్స్
- బిక్కుబిక్కుమంటూ రాకపోకలు



చినపులిపాక వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన, (ఇన్‌సెట్లో) దెబ్బతిని విరిగిపోయిన రెయిలింగ్స్

తోట్లవల్లూరు: మండలంలోని వల్లూరుపాలెం–కంకిపాడు ప్రధాన రహదారిలో చినపులిపాక వద్ద బందరు కాలువపై వంతెన ప్రమాదభరితంగా మారింది. వంతెన నిర్మించి సుమారు 60 ఏళ్లకుపైగా కావస్తోంది. ఇసుక లారీల తాకిడి ఎక్కువగా ఉండటంతో వంతెన బాగా దెబ్బతింది. చినపులిపాక, బొడ్డపాడు గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన తోట్లవల్లూరు రావాలన్నా, వల్లూరుపాలెం గ్రామస్తులు కంకిపాడు వెళ్లాలన్నా దీనిపైనే ప్రయాణించాలి. దీంతో ఈ రహదారిలో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

ఆదమరిస్తే అంతే..

వంతెన శ్లాబు భాగంలో రంధ్రం ఏర్పడింది. వంతెనకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్స్ పాడైపోయి విరిగిపోయాయి. ఈ నేపథ్యంలో వంతెనపై నుంచి లారీలు, ఆర్టీసీ బస్సుల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. ద్విచక్ర వాహనదారులు మరింత జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోంది. ఏ క్షణాన కూలుతుందో తెలియని వంతెనపై ప్రయాణించాలంటే భయంగా ఉంటోందని ద్విచక్రవాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

విజ్ఞప్తి చేసినా ఫలితం శూన్యం

బందరు కాలువపై దెబ్బతిన్న శిథిల వంతెన స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు చాలా కాలం నుంచి అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేదు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వంతెనపై రాకపోకలు సాగించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రాకపోకలు



చినపులిపాక వద్ద బందరు కాలువపై వంతెన ప్రమాదకరంగా మారింది. ఇసుక లారీల తాకిడి కూడా ఎక్కువ కావటంతో వంతెన పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ప్రజలు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.
– ఆరేపల్లి శివరామకృష్ణ, సర్పంచ్, చినపులిపాక

ప్రతిపాదనలు పంపాం



చినపులిపాక వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన విషయం వాస్తవమే. ఉయ్యూరు డివిజన్‌లో దెబ్బతిన్న వంతెనల వివరాలు ఇప్పటికే ప్రభుత్వానికి పంపించాం. కొత్త వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాల్సి ఉంది.
– మల్లికార్జున, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ

ఫ్యాప్టో నిరసనను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల రెండో తేదీన నిర్వహించనున్న నిరసనను జయప్రదం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు పి. ఇమ్మానుయేల్, డి. చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రధాన సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల సమైఖ్య పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, ఫ్యాప్టో సంఘాల కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసం నిరసన

కూచిపూడి(మొవ్వ): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఏప్రిల్ 2వ తేదీన మచిలీపట్నం కలెక్టరేట్‌లో వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణా జిల్లా ఫ్యాప్టో చైర్మన్ అంబటిపూడి సుబ్రమణ్యం పిలుపు నిచ్చారు. మండలంలోని కూచిపూడిలో జరిగిన సన్నాహక సమావేశం సోమవారం నిర్వహించారు. ఫ్యాప్టో నాయకులు రవీంద్రబాబు, శ్రీనివాసరావు, మాణిక్యాలరావు, కేఎస్ సోమేశ్వరరావు, సురేష్, రమేష్‌బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కల్లంలో ఆరబెట్టిన మిర్చి మాయం

తోట్లవల్లూరు: కల్లంలో ఆరబెట్టిన మిర్చి పంట అపహరణకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని చాగంటిపాడు శివారు కళ్లంవారిపాలెంకు చెందిన రైతు జొన్నల శివరామకృష్ణారెడ్డి కరకట్ట వెంబడి తన పొలంలో మిర్చిని కోత కోసి కల్లంలో ఆరబెట్టారు. కల్లంలో ఉంచిన మిర్చిని గత శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మిర్చిని ఎత్తుకుపోయే క్రమంలో సుమారు ఐదు కేజీల వరకు వేరే ప్రదేశంలో పారబోయటం ఆశ్చర్యం కలిగిస్తోంది. సుమారు క్వింటా వరకు మిర్చిని దొంగలు ఎత్తుకుపోయినట్లు రైతు శివరామకృష్ణారెడ్డి తెలిపారు. అపహరించిన మిర్చి విలువ రూ.15 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఇదే కల్లంలో గత నాలుగైదు రోజుల క్రితం వేరే రైతుకు చెందిన సుమారు 45 కిలోల వరకు మిర్చిని దొంగలు అపహరించినట్లు తెలుస్తోంది. మిర్చి దొంగతనానికి సంబంధించి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బాధిత రైతులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి వేళ గస్తీని ముమ్మరం చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చూడాలని రైతులు కోరుతున్నారు.


దొంగలు పారబోసిన మిర్చిని పరిశీలిస్తున్న పోలీసు

ఇంటి పన్నుల వసూళ్లను పూర్తి చేయాలి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో ఇంటి పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని గుడివాడ డీఎల్పీఓ జి.సంపత్‌కుమారి సోమవారం పరిశీలించారు. లక్ష్యానికి మిగిలిన ఇంటి పన్నుల వసూళ్లను వెంటనే పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఎంపీడీఓ టి.విజయసారథి, గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి రాజకీయ రంగు

టీడీపీ కార్యాలయంలో ఉత్సవ పోస్టర్ల ఆవిష్కరణ


గుడివాడ టీడీపీ కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించిన నాయకులు

గుడివాడరూరల్: అపరభద్రాదిగా పేరుగాంచిన మోటూరు(గోదాపురం)లోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలకు రాజకీయ రంగు పులుముకుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా టీడీపీ కార్యాలయంలో ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించడం తాము ఎన్నడూ చూడలేదని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు సీతారాముల కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని హడావుడిగా సోమవారం గుడివాడ టీడీపీ కార్యాలయంలో మోటూరు గ్రామ నాయకులు ఉత్సవ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది ఆలయం వద్ద ఉత్సవ కమిటీని ఆలయ ఈఓ సమక్షంలో ఏర్పాటు చేసుకుని ప్రశాంత వాతావరణంలో జరిగే స్వామివారి ఉత్సవాలు ఈ ఏడాది రాజకీయ రంగు పులుముకోవడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది అధికార పార్టీకి చెందిన నాయకుల స్వార్థపూరితంగా వ్యవహరించి దేవుడి కార్యక్రమానికి రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

హడావుడిగా ఏర్పాట్లు

ప్రతి ఏడాదీ ఉత్సవాలకు వారం ముందు ఆలయ పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం ఉత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభమయ్యే క్రమంలో సోమవారం సాయంత్రం నుంచి ఏర్పాట్లు హడావుడిగా మొదలు పెట్టారు. అధికార పార్టీ నాయకులు కావాలనే స్వామివారి ఉత్సవాల నిర్వహణను తమ చేతుల్లోకి తీసుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన ఓ మాజీ సర్పంచ్ భర్త తాను సర్పంచ్ అని చెప్పుకుంటూ ఆలయ వంశపారపర్యం ధర్మకర్తలను కూడా బెదిరింపులకు గురిచేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దేవదాయశాఖ అధికారులు కూడా చేతులెత్తేసి అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదం అన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఏది ఏమైనా మోటూరు రామాలయం చరిత్రలో ఇలా ఎప్పుడు జరగలేదని, ఉత్సవాల నిర్వహణను ఆ రాముల వారే చూసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రోడ్ల నిర్మాణంతోనే గ్రామాల అభివృద్ధి



ముదినేపల్లి రూరల్: సీసీ రోడ్ల నిర్మాణంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిగురుకోట, చినకామనపూడి, పెదకామనపూడి, వడాలి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, ఎన్డీయే నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ముదినేపల్లి రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి స్థానిక వైద్యుడు అంబుల మనోజ్ సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని పెదగొన్నూరు శివారు, విశ్వనాద్రిపాలెంలో పెయ్యల దుర్గారావు అనారోగ్యంతో మరణించారు. అతని కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయాన్ని మనోజ్ అందజేశారు

బోనస్ ప్రకటనపై హర్షం

ముదినేపల్లి రూరల్: పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి మూడో విడత బోనస్ ప్రకటించడంపై మండలంలోని పాల సంఘాల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని వడాలి సంఘంలో అధ్యక్షుడు ఈడే బాబూజీరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యక్షులు మాట్లాడుతూ క్రమం తప్పకుండా బోనస్ అందించేందుకు కృషి చేస్తున్న యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ అల్లూరి సీతారామరాజు కాలనీలో కోటదుర్గమ్మ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. ప్రముఖ యాజ్ఞికులు సుసర్ల సత్యనారాయణమూర్తి, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు నిర్వహించారు.

వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకించండి

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న వక్ఫ్‌బోర్డు బిల్లును సమాజం వ్యతిరేకించాలని ముస్లిం సమైఖ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ మహబూబ్ అలి అన్నారు. సోమవారం స్థానిక కార్మిక నగర్ మసీదు వద్ద ముస్లింలు వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని గురజాడ గ్రామంలో ముస్లింలు వక్ఫ్‌బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ శాంతియుతంగా ప్రార్థనలు చేశారు. బిల్లును రద్దుచేయాలని మతపెద్దలు కోరారు.

ఉచిత వైద్యశిబిరం



ముదినేపల్లి రూరల్: స్థానిక ఏకే స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో బీపీ, సుగర్, కీళ్లనొప్పులు, థైరాయిడ్, పక్షవాతం, లివర్ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు పి.కళాసాగర్, పి.అనూష, ఎన్.పవన్, ఎల్.అమూల్య, ఎస్వీ చైతన్యకృష్ణ పరీక్షలు నిర్వహించారు.

చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి

పామర్రు: చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని పామర్రు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం శక్తి ఉమెన్‌యాప్‌లను డౌన్ లోడు చేసుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా 112 నంబరుకు అత్యవసర సమయాల్లో కాల్ చేస్తే తగు విధమైన రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు.

ఘనంగా రంజాన్ వేడుకలు


గుడివాడ మియాఖాన్ మసీదులో ముస్లింలు


తోట్లవల్లూరులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


అలీనఖీపాలెం గథీర్ సొసైటీలో రంజాన్ వేడుకలు

గుడివాడ టౌన్: రంజాన్ పర్వదిన వేడుకలు ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మియాఖాన్, నూర్, గుల్జార్‌చౌక్, షాహి, కార్మిక నగర్, ఇందిరానగర్ కాలనీ తదితర మసీదుల్లో సోమవారం ఉదయం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు పవిత్ర ఖురాన్ నుంచి కొన్ని అంశాలను సందేశంగా ప్రవచించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పవిత్రమైన రంజాన్ పండుగ దాన ధర్మాలకు ప్రతీక అని మత గురువులు తెలిపారు.

తోట్లవల్లూరు: రంజాన్ పర్వదిన వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పిల్లలు, పెద్దలు పవిత్ర స్నానాలను ఆచరించి నూతన వస్త్రాలను ధరించి ఒకరికొకరు పరస్పరం పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. తోట్లవల్లూరు అంజుమన్ భవనంపై జరిగిన ప్రార్థనల్లో వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. మత గురువు హసన్ దైవసందేశం వినిపించి, ప్రార్థనలు నిర్వహించారు.

పమిడిముక్కల: రంజాన్ పర్వదినాన్ని మండలంలోని గురజాడ, కపిలేశ్వరపురం, వీరంకిలాకు, మేడూరు, ఫత్తేలంక, అలీనఖీపాలెంలో ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ ముస్లింలకు ఈద్–ఉల్–ఫితర్ శుభాకాంక్షలు తెలియజేశారు.

గుడ్లవల్లేరు: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలు గుడ్లవల్లేరు మండలంలోని మసీదుల్లో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కౌతవరం ఒకటో వార్డు, చెక్‌పోస్టు, తురాయిపాలెం, లంకాదొడ్డి, శేరీ దుగ్గుమిల్లి, కట్టవానిచెరువు, పెంజెండ్ర మసీదుల్లోని జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలోని కోసూరు, నిడుమోలు, మొవ్వ, పెదపూడి, భట్లపెనుమర్రు గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా భట్లపెనుమర్రు గ్రామంలోని మసీదులో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఈద్–ఉల్–ఫితర్ వేడుకలు నిర్వహించారు. మసీదు గురువు మహమ్మద్ యాకుబ్ పాషా ప్రసంగించారు. నిడుమోలు మసీదులో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు.

పామర్రులో..

పామర్రు: జాన్ నెల రోజుల దీక్షలతో వారి జీవితాల్లో తద్వారా ఇహ పరలోకాల సాఫల్యం పొందాలని దేవుడి ఉద్దేశమని మత గురువులు ఉమ్రి, ముస్తఖీం పేర్కొన్నారు. రంజాన్‌ను ముస్లింలు స్థానిక ఈద్గా వద్ద సోమవారం నిర్వహించారు. ముస్లింలు ప్రార్థనలు నిర్వహించి, ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ, కొర్నిపాడు, గ్రామాల్లో ముస్లింలు సోమవారం రంజాన్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఒకరికొకరు రంజాన్ శుభాంక్షాలు తెలుపుకున్నారు.

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండలంలోని ముదినేపల్లి, సంఖర్షణపురం, గురజలో ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

కైకలూరులో..

కైకలూరు: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కైకలూరు, కలిదిండి ఈద్‌గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు ఇలా హాల్ హక్ ప్రసంగిస్తూ అందరూ దాన గుణం అలవర్చుకోవాలన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ రామకృష్ణ, కూటమి నేతలు త్రినాథరాజు, పూలా రాజీ, ఎండీ.జానీ తదితరులు పాల్గొన్నారు.


గుడ్లవల్లేరు మండలం దోకిపర్రు మసీదులో ముస్లింల ప్రార్థనలు


నిడుమోలులో రంజాన్ తోఫాను అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా


పామర్రు ఈద్గాలో మాట్లాడుతున్న మత పెద్దలు

ఏఎంసీ నూతన చైర్మన్ పొట్లూరికి అభినందన

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్‌ను సోమవారం స్థానిక ముస్లింలు అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు అడ్డుమిల్లి చిట్టిబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వీరమాచినేని శివప్రసాద్, ముస్లిం పెద్దలు ఫైజుల్ హక్, సర్దార్, నాగూర్ పాల్గొన్నారు.

6 నుంచి సీతారామస్వామి కల్యాణోత్సవాలు

మండవల్లి: మండవల్లి శ్రీ కోదండ రామాలయంలో ఈ నెల 6 నుంచి 8 వరకు శ్రీ సీతారామస్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీ సీతారామస్వామి కల్యాణ మహోత్సవం, 7న అష్టోత్తర సహస్రనామార్చనలు, నీరాజన మంత్రపుష్పం, 8న మధ్యాహ్నం మూడు గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు స్వామి పవళింపు సేవ, 9న రాత్రి 6 గంటలకు అన్నసమారాధన జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

స్వయం ఉపాధి పథకాలకు ఇంటర్వ్యూలు

కైకలూరు: మండలంలో బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు బుధవారం ఉదయం 10 గంటలకు కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.ఫణీంద్ర సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

కైకలూరు: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కైకలూరు శ్రీ రామకృష్ణ సేవా సమితి వద్ద అన్నమయ్య పద సాహిత్య ప్రచారకురాలు కొండవీటి జ్యోతిర్మయి సంగీత విభావరి సోమవారం ఆకట్టుకుంది. కైకలూరుకు చెందిన పసుమర్తి శ్రీవల్లి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో నిర్వాహకులు రాజేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు శ్రీ శ్యామశాస్త్రి జయంతి

గుడివాడ టౌన్: శ్రీ శ్యామ కృష్ణ గానసభ, శ్రీ త్యాగబ్రహ్మ వైభవ ప్రకాశ సభ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ శ్యామ శాస్త్రి జయంతి ఉత్సవాలు మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట సత్రంలో జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.